# హైదరాబాద్‌లో ఐటీ పెట్టుబడుల ప్రాంతం

- 50వేల ఎకరాల్లో ఏర్పాటు
- 15 లక్షల మందికి ఉపాధి: పొన్నాల

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ పరిసరాల్లో 50 వేల ఎకరాల్లో సమాచార సాంకేతిక పరిజ్ఞాన పెట్టుబడుల ప్రాంతం(ఐటీఐఆర్)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. వచ్చే 25 ఏళ్లలో దాదాపు 202 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రెండు దఫాలుగా ఈ ప్రాజెక్టును చేపడతామని చెప్పారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ దీని ఏర్పాటుకు ప్రాథమిక ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటైతే రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో భారీగా పెట్టుబడులు వస్తాయని తెలిపారు. ఐటీ పరిశ్రమలో ప్రస్తుతం మూడు లక్షల మందికి నేరుగా ఉపాధి లభిస్తోందన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు అమలైతే (మిగతా 2లో)

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంఖ్య 15 లక్షలకు చేరుతుందని, మరో రూ.50 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. పొన్నాల శనివారమిక్కడ విలేఖరులతో మాట్లాడారు. ఐటీఐఆర్ పరిధిలో ఐటీ, ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పరిశ్రమలతోపాటు ప్రత్యేక ఆర్థిక మండళ్లు, పారిశ్రామిక పార్కులు, స్వేచ్ఛా వాణిజ్య మండళ్లు, ఎగుమతుల కేంద్రాలు, అభివృద్ధి ప్రాంతాలుంటాయని వివరించారు.

## ఐటీఐఆర్ ప్రధానాంశాలు

- గచ్చిబౌలి, మాదాపూర్ సహా సైబరాబాద్ అభివృద్ధి మండలి(సీడీఏ), మామిడిపల్లి, రావిరాల, ఆదిభట్ల, మహేశ్వరం, ఉప్పల్, పోచారం గ్రామాలతోపాటు హైదరాబాద్ విమానాశ్రయ అభివృద్ధి ప్రాధికార సంస్థ(హెచ్ఏడీఏ) పరిధిలోని 50 వేల ఎకరాల్లో ఐటీఐఆర్ ప్రాజెక్టు ఏర్పాటవుతుంది.
- అంతర్గత మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.13 వేల కోట్లు, బాహ్య మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం 'వయబిలిటీ గ్యాప్ ఫండ్(వీజీఎఫ్)' కింద అందించే రూ.2,189 కోట్లు వెచ్చిస్తారు.
- ప్రాజెక్టు ఏర్పాటుతో ప్రస్తుతం రూ.50 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు రూ.2.35 లక్షల కోట్లకు పెరుగుతాయి.
- రూ.6 వేల కోట్లుగా ఉన్న ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ తయారీ రంగం ఎగుమతులు రూ.80 వేల కోట్లకు చేరుకుంటాయి.
- ఐటీ పరిశ్రమల కోసం నిర్మిత స్థలం విస్తీర్ణం 40 మిలియన్ల చదరపు అడుగుల నుంచి 130 మిలియన్ల చదరపు అడుగులకు పెరుగుతుంది.